
సాక్షి పల్నాడు

మంగళవారం । 14 । మే । 2024



రెచ్చిపోయిన టీడీపీ మూకలు

దుర్గి: మండలంలోని ముటుకూరు గ్రామ ఎస్సీ కాలనీలో సోమవారం టీడీపీ మూకలు రెచ్చిపోయి విధ్వంసం సృష్టించాయి. -8లో▸



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణోత్సవం సోమవారం జరిగింది.



ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం చూపుడు వేలు చూపుతున్న నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మంత్రి అంబటి రాంబాబు దంపతులు, నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుటుంబసభ్యులు, వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు దంపతులు, పెదకూరపాడు ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావు, చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగమనోహరనాయుడు

న్యూస్‌రీల్

దాడులను ఖండించిన కాసు, అనిల్‌కుమార్ యాదవ్

దాచేపల్లి: మండలంలోని కేసానుపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులను ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. టీడీపీ నేతల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లా శ్రీనివాసరావు, నెల్లూరి రామారావు, చుండు రామారావు, బొల్లా మధు, దిలీఫ్‌లను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న పోలీస్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన టీడీపీ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యకర్తలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని వారు చెప్పారు.

జంగాలపల్లిలో రీ పోలింగ్ నిర్వహించాలి

ఎమ్మెల్యే బొల్లా



వినుకొండ (నూజెండ్ల): నూజెండ్ల మండలం జంగాలపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని మళ్లీ రీ పోలింగ్ చేపట్టాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పోలింగ్ కేంద్రం వద్ద బైఠాయించి నిరసన తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పోలింగ్ కేంద్రం వద్ద ఉండి రిగ్గింగ్‌కు చేసేందుకు గొడవలు సృష్టించి ప్రజలను రెచ్చగొడుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఎస్సీలను ఓటింగ్‌కు రాకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అధికారుల దృష్టికి సమస్యను తెలియజేశారు. పలు పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. నూజెండ్ల మండలం రెడ్డికొత్తూరులో జరిగిన దాడులను ఆయన ఖండించారు.

ఎమ్మెల్యే కాసు కాన్వాయ్‌పై రాళ్ల దాడి



దాచేపల్లి: గురజాల అసెంబ్లీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి కాన్వాయ్‌పై టీడీపీ మూకలు రాళ్లు విసిరాయి. నగర పంచాయతీ పరిధిలోని నడికుడి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సరళి పరిశీలించేందుకు ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి వెళ్లారు. పోలింగ్ సరళి పరిశీలించి వస్తున్న సమయంలో ఎమ్మెల్యే కాసు కాన్వాయ్‌పై టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఎమ్మెల్యే కారుపై రాళ్లు పడ్డాయి. మరికొన్ని కార్లపై రాళ్లు విసిరారు. ఎమ్మెల్యే కాసుపై టీడీపీ నాయకులు రాళ్లు విసురుతున్నారన్న విషయం తెలుసుకున్న పార్టీ కార్యకర్తలు అక్కడకు భారీగా చేరుకున్నారు. టీడీపీ నాయకుల దాడిని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రతిఘటించారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటు వేసుకునేందుకు ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యే కాసు అక్కడ నుంచి వెళ్లారు. ఎమ్మెల్యే కాసు కాన్వాయ్‌పై రాళ్లు విసరటాన్ని స్థానిక నాయకులు తీవ్రంగా ఖండించారు.

ఓటు కోసం కాదు..



తాడేపల్లిరూరల్: ఎన్నికల వేళ క్యూలైన్ చూసి ఓటు హక్కు కోసం నిలబడ్డారంటే పప్పులో కాలు వేసినట్లే. ఎన్నికల సమయం ముగియడంతో బార్‌లు సోమవారం సాయంత్రం తెరుచుకున్నాయి. దాంతో బారుల ముందు ఎక్కడ చూసినా రోడ్డు మీద వరకు మందుబాబులు క్యూ కట్టి.. గంటల తరబడి లైన్‌లో వేసి ఉన్నారు.

ఓటేశారు...

పల్నాడులో పోటెత్తిన ఓటర్లు-పలుచోట్ల హింసాత్మక ఘటనలు



వృద్ధురాలిని వీల్‌చైర్‌లో కేంద్రానికి తీసుకువస్తున్న దృశ్యం

- ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- జిల్లాలో పలు ప్రాంతాల్లో కొంత సేపు మొరాయించిన ఈవీఎంలు
- ఉదయం 9 గంటలకు 8.22 శాతం పోలింగ్ నమోదు
- మండుటెండను లెక్క చేయకుండా ఓటు చేసిన ఓటర్లు
- పలుచోట్ల దౌర్జన్యానికి దిగిన తెలుగు తమ్ముళ్లు
- రాత్రి 10 గంటలకు కొన్ని ప్రాంతాలలో కొనసాగుతున్న పోలింగ్
- రాత్రి 10 గంటలకు జిల్లాలో 78 శాతం పోలింగ్ నమోదు
- ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకున్న తొలిసారి ఓటర్లు



మాచర్లలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

సాక్షి, నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో పల్నాడు జిల్లా ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. ఉదయం 6 గంటలకు ముందే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉత్సాహం ఓటర్లలో కనిపించింది. ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ చేసే సమయానికే మహిళలతో క్యూలైన్లు నిండిపోవడం విశేషం. ఎండ వేడిమి తప్పించుకొనేందుకో, ఓటు హక్కును వినియోగించుకోవడంలో బాధ్యతగా భావించిగానీ పోలింగ్ కేంద్రాల వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. జిల్లాలో పలు ప్రాంత్రాల్లో ఉదయం నుంచి ఈవీఎంలు మాక్ పోల్‌లో మొరాయించటం ఓటర్లలను తీవ్ర నిరాశ పరిచింది. కొన్ని చోట్ల ఓటు వేసేందుకు క్యూలో గంటల కొద్దీ వేచి చూసి, తమ ఓటుహక్కను వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో మొరాయించిన ఈవీఎం, వీవీప్యాట్‌లను రిపేరు చేయడంతోపాటు, వాటి స్థానంలో కొత్తవాటిని అధికారులు రీప్లేస్ చేశారు. ఉదయం 9 గంటలకు జిల్లాలో 8.22 శాతం పోలింగ్ మాత్రమే నమోదు కావడం గమనార్హం. ఆ తరువాత పోలింగ్ ప్రక్రియ వేగం పుంజుకుంది. రెంటచింతల మండల పరిధిలో ఏడు ఈవీఎంలను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేయడంతో రెండు గంటలకుపైగా పోలింగ్ నిలిచింది. తరువాత కొత్త ఈవీఎంలతో మిగిలిన పోలింగ్ పూర్తి చేశారు. పోలింగ్‌బూత్‌ల వద్ద మహిళలు, వద్ధులు ఉత్సాహంగా ఓటు వేయడంతో వైఎస్సార్‌సీపీ నేతల్లో జోష్ పెరిగింది. రాత్రి 10 గంటలకు జిల్లాలో పోలింగ్ శాతం 78గా నమోదైంది. ఇంకా క్యూలైన్లలో ఓటర్లు ఉండటంతో ఇది 80 శాతానికి పైగా నమోదు అయ్యే అవకాశం ఉంది.

రాత్రి 10 గంటలకు క్యూ లైన్లలోనే...

పల్నాడు జిల్లాలో పలు పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ గడవు ముగిసే సమయం సాయంత్రం 6 గంటలకు కూడా వందలాదిమంది క్యూలలో ఉన్నారు. దీంతో అధికారులు గడువులోగా వచ్చినవారికి స్లిప్పులు అందజేసి ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. ఓటర్లు ఎక్కువగా ఉండటం, ఈవీఎంలు మొరాయించిన చోట్ల రాత్రి 10 గంటలకు ఓటర్లు క్యూలో ఉన్నారు. ఓటింగ్‌కు హాజరైన వారికి అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేశారు. ముఖ్యంగా తాగునీరు, ఎండ వేడిమి నుంచి రక్షించడానికి షామియానాలు, వీల్‌చైర్లు అందుబాటులో ఉంచారు.

ఉత్సాహంగా పాల్గొన్న తొలిసారి ఓటర్లు...

సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి ఓటు వేసే అవకాశం వచ్చిన యువత ఉత్సాహంగా తమ ఓటును వినియోగించుకున్నారు. ఉదయమే పోలింగ్ బూత్‌ల వద్దకు చేరుకొని తమ హక్కును వృథా కాకుండా చూశారు. ఓటువేసిన తరువాత యువ ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. మిగిలిన వారిని ఓటు వేయమని ప్రోత్సహించారు.

దౌర్జన్యాలకు పాల్పడ్డ టీడీపీ

జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు నామమాత్రంగా ఉండటంతో, ఇష్టారాజ్యంగా పోలింగ్ కేంద్రాలల్లో టీడీపీ నాయకులు హల్‌చల్ చేశారు. ఓటర్ల స్లిప్‌లు తీసుకొని రిగ్గింగ్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లను పలుచోట్ల భయభ్రాంతులకు గురిచేసి, గెంటేశారు. టీడీపీ నాయకులు తమ పార్టీకి అనుకూలంగా లేని ఓటర్లను భయపెట్టి పోలింగ్‌కు దూరమయ్యేలా చేశారు. మాచర్ల, గురజాల, సత్తెనపల్లి, నరసరావుపేటలో టీడీపీ నేతలు హింసాత్మక ఘటనలతో పదుల సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నేతలు గాయపడ్డారు. వెల్దుర్తి మండలం కండ్లగుంట గ్రామం 114, 115 పోలింగ్ బూత్‌లలో విద్యుత్‌అంతరాయానికి కారణమైన లైన్మెన్ రామాంజనేయులను విధుల నుంచి జిల్లా ఎన్నికల అధికారి తప్పించారు.



నరసరావుపేటలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళలు

ఓటు హక్కు వినియోగించుకున్న శతాధిక వృద్ధులు



101 ఏళ్ల వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి మోసుకొస్తున్న యువకుడు

రొంపిచర్ల: మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన 105 ఏళ్ల వృద్ధురాలైన కాకుమాను మహాలక్ష్మమ్మ తన ఓటు హక్కును సోమవారం వినియోగించుకున్నారు. తన కుటుంబ సభ్యుల సహాయంతో పోలింగ్ కేంద్రం వద్దకు రాగా అక్కడ సిబ్బంది ఆమెను వీల్‌చైర్‌పై పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లటంతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. 17వ సారి ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆమె తెలిపారు.

రాజుపాలెం: రాజుపాలెం ఆర్ ఆర్ సెంటర్‌లో 133 పోలింగ్ బూత్ కేంద్రం ఏర్పాటు చేశారు. సోమవారం 101 ఏళ్ల వయస్సు గల చేవూరి వెంకాయమ్మ అనే వృద్ధురాలిని తనయుడు ఇంటి వద్ద నుంచి చేతులపై మోసుకుని వచ్చి ఓటు వేయించి తీసుకెళ్లాడు.



ఓటు హక్కు వినియోగించుకున్న శతాధిక వృద్ధురాలు మహాలక్ష్మమ్మ

పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత

- పలుచోట్ల వైఎస్సార్ సీపీ శ్రేణులపై టీడీపీ నేతలు దాడి
- ఓటమి భయంతో రెచ్చిపోయిన టీడీపీ మూకలు
- పలుచోట్ల ఈవీఎంల మొరాయింపుతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం
- ముప్పాళ్లలో మంత్రి అంబటిపై దౌర్జన్యానికి దిగిన కన్నాతో ఉన్న గుంటూరు గూండాలు
- నార్నెపాడులో మంత్రి అల్లుడు ఉపేష్ కారు అద్దాలు ధ్వంసం
- చీమలమర్రి, గుండ్లపల్లిలో ఈవీఎంలు ధ్వంసం
- పీఏసీఎస్ అధ్యక్షుడు కావేటి రామారావు ఇల్లు, కారు ధ్వంసం



సత్తెనపల్లిలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, అల్లుడు ఉపేష్



నార్నెపాడులో టీడీపీ నేతల దాడిలో ధ్వంసమైన చీఫ్ ఏజెంట్, మంత్రి అంబటి అల్లుడు ఉపేష్ కారు



కారు ధ్వంసానికి ఉపయోగించిన రాయి

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సత్తెనపల్లి నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం ఉద్రిక్తత నెలకొంది. పట్టణంలోని 23వ వార్డులో వైఎస్సార్ సీపీ శ్రేణులను రెచ్చగొట్టి ఉసిగొలిపారు. సహనం కోల్పోయేలా దూషణల పర్వం చేశారు. దీంతో ఆ వార్డు కౌన్సిలర్ ఆకుల రమేష్ ప్రశ్నించడంతో జనసేనకు చెందిన వల్లెం శ్రీనివాసరావు (రాడ్లు శ్రీను) దాడులకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ దాడిలో పలువురికి గాయాలయ్యాయి.

✦ సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై టీడీపీ సానుభూతి పరులు దాడులకు దిగడంతో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ధూళిపాళ్లలో పోలింగ్ బూత్ వద్ద టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకులు మధ్య వాగ్వివాదం చోటుచేసుకోవడంతో పోలీసులు చేరుకొని హెచ్చరికలు చేయడంతో సద్దుమణిగింది. ఫణిదం గ్రామంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల పై టీడీపీకి చెందిన కొందరు దాడులకు దిగారు.

✦ ముప్పాళ్ల మండలం తొండపిలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు రాళ్లు రువ్వారు. 15 మందికి గాయాలయ్యాయి. నార్నేపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ ఏజెంట్లను టీడీపీ నాయకులు బయటకు లాగేయడంతో విషయం తెలుసుకున్న ఎన్నికల చీఫ్ ఏజెంట్ మంత్రి అంబటి రాంబాబు అల్లుడు ఉపేష్ చంద్రచౌదరి అక్కడకు వెళ్లగా ఆయన కారు అద్దాలు ధ్వంసం చేశారు. మంత్రి అంబటి రాంబాబు, చీఫ్ ఏజెంట్ ఉపేష్ చంద్రచౌదరి దాడులకు పాల్పడిన వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ముప్పాళ్ల మండలం దమ్మాలపాడు గ్రామంలోని 253, 254 పోలింగ్ బూత్‌లలో ఎన్నికల సిబ్బందితో కుమ్మక్కై టీడీపీ వర్గీయులు చేసిన అవకతవకలపై ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. పోలింగ్ బూత్‌లలో రీ పోలింగ్‌కు ఆదేశించాలని కోరారు. ముప్పాళ్ళ పోలింగ్ బూత్ వద్ద మంత్రి అంబటి రాంబాబు, టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఒకే సమయంలో ఎదురుపడటంతో ఒక్కసారిగా కన్నా పక్కన ఉన్న గుంటూరు గుండాలు, సత్తెనపల్లికి చెందిన రౌడీషీటర్లు ఘర్షణకు దిగారు. ఇరువర్గాల మధ్య తోపులాటలు, వాదోపవాదాలు పెద్ద ఎత్తున జరిగాయి.

✦ నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామంలో 198 పోలింగ్ బూత్లోని ఈవీఎంను టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కావేటి రామారావు ఇంటిని, కారును టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఐదుగురికి గాయాలయ్యాయి. తహసీల్దార్ ఘటనా స్థలానికి చేరుకొని ఎన్నికల ప్రక్రియను పున:ప్రారంభించారు. రూపెనగుంట్లలో వైఎస్సార్ సీపీ శ్రేణులపై టీడీపీ నేతలు దాడులకు దిగారు. ఐదుగురికి గాయాలు కాగా ఒకరికి తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. గుండ్లపల్లిలోని 170, 171 బూత్‌ల వద్ద టీడీపీ నేతలు దాడులకు దిగారు. వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు గుత్తికొండ నన్నేసా చేతికి త్రీగాయమైంది. 170 పోలింగ్ బూత్‌లోని ఈవీఎంను టీడీపీ నేతలు ధ్వంసం చేశారు. దీనిపై కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకు వెళ్లారు. ఈ ఘటనలో వైఎస్సార్ సీపీకి చెందిన 10 మందికి గాయాలయ్యాయి. కుంకటగుంటలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగా వైఎస్సార్ సీపీకి చెందిన నలుగురికి గాయాలయ్యాయి. అరగంటపాటు పోలింగ్ నిలిచిపోయింది.

✦ రాజుపాలెం మండలం గణపవరంలోని 50, 51 పోలింగ్ బూత్‌ల వద్ద ఘర్షణ జరగ్గా మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డికి గాయాలయ్యాయి.

చెలరేగిన టీడీపీ అరాచక శక్తులు

- ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు కుట్ర
- వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కర్రలు, రాళ్లతో దాడులు
- కంభంపాడులో తీవ్ర ఉద్రిక్తత

మాచర్ల రూరల్: మాచర్ల రూరల్ మండలంలో టీడీపీ అరాచక శక్తులు రెచ్చిపోయాయి. కర్రలు, కత్తులతో మూకుమ్మడిగా దాడి చేసి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన మండలంలోని కంభంపాడు, రాయవరం, కొత్తపల్లి గ్రామాలలో సోమవారం చోటుచేసుకుంది. కంభంపాడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందా, ఏమైనా సాంకేతిక కారణాలున్నాయా అని తెలుసుకునేందుకు అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు జువ్వాజి సాంబిరెడ్డి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడే ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకొని దుర్భాషలాడారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి, అందరూ ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో వెనుతిరిగి వస్తున్న సమయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇనుపరాడ్లు, కర్రలు, కత్తులతో వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులకు తెగబడ్డారు. పోలింగ్ కేంద్రాలకు ప్రజలు రాకుండా అడ్డుకునేందుకు రాళ్లు, కర్రలతో దాడులు చేసి పలువురిని గాయపరిచ్చారు. ఈ సంఘటనలో వైఎస్సార్ సీపీకి చెందిన ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ప్రజలు, వృద్ధులు, వికలాంగులు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో గ్రామంలో ఒక్కసారిగా భయాందోళనలతో కూడిన వాతావరణాన్ని ప్రేరేపించి ఓటింగ్ శాతాన్ని తగ్గించాలని టీడీపీ కుట్రను వైఎస్సార్‌సీపీ తిప్పికొడుతూ తమ వర్గాలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. సంఘటన తెలుసుకున్న గుంటూరు రేంజ్ ఐజీ శంకర్ వక్రా గ్రామానికి చేరుకొని శాంతిభద్రతలను పర్యవేక్షించారు.



కంభంపాడు గ్రామంలో శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్న గుంటూరు రేంజ్ ఐజీ

ఈవీఎం ధ్వంసానికి యత్నం

ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ఎక్కువగా ఓట్లు నమోదు అవుతున్నాయన్న కుట్రతో గ్రామంలోని టీడీపీ నాయకులు ఈవీఎంను ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయగా టీడీపీకి చెందిన గాలి మన్నెగౌడ్, భీమా కృష్ణమూర్తి, రోశయ్య, చిలమల వాసు, దాసరి నారాయణ, భీమా వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, బ్రహ్మం తదితరులు వైఎస్సార్ సీపీ వారిపై రాళ్లు, కర్రలు, బీరు సీసాలతో దాడులు చేసి వారిని భయభ్రాంతులకు గురిచేశారు. ఈ సంఘటనలో పోలీసులకు చెందిన టాటాఏసి వాహనం పూర్తిగా ధ్వంసమైంది.

కొత్తపల్లిలో

ఎస్సీ కాలనీ వర్గీయులను పోలింగ్ కేంద్రంలో అడ్డుకునే ప్రయత్నాన్ని నివారించిన వైఎస్సార్ సీపీ సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి బంధువు తుమ్మా రాజశేఖర్‌రెడ్డిపై దాడి చేశారు. ఈ సంఘటనలో వీపుకు బలమైన గాయమైంది. మూడు జిల్లాల పోలీసు అధికారులు, సీఆర్‌పీఎఫ్ బెటాలియన్లు ప్రత్యేక వాహనాల్లో తిరుగుతున్నా వారి ముందే కర్రలతో, కత్తులతో దాడులు చేస్తుంటే కనీసం నివారించటంలో పూర్తిగా విఫలమైనట్లు కనిపిస్తుంది. పోలింగ్ కేంద్రాల రక్షణకే మొదటి ప్రాధాన్యతనిచ్చి గ్రామాలలో శాంతిభద్రతల నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు.



కంభంపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ అభిమానులపై రాళ్లు, కర్రలతో దాడులు చేస్తున్న టీడీపీ నాయకులు

పెదఅగ్రహారంలో పచ్చ మూకల బీభత్సం

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు గాయాలు
- బ్రాహ్మణపల్లిలో రిగ్గింగ్‌కు యత్నం
- కరాలపాడులో పోలింగ్ కేంద్రంపై రాళ్లు


గాయాలపాలైన కృష్ణ


బ్రాహ్మణపల్లిల్లో ధ్వంసమైన కారు

పిడుగురాళ్లరూరల్: మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడారు. దీనిలో భాగంగా పెద అగ్రహారం గ్రామంలో చప్పిడి శ్రీను, జిలుగు ఆదాం పలువురు ఓట్లు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చారు. వారిపై తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి చేశారు. దాడిలో గాయపడిన వారిని పిడుగురాళ్ల పట్టణంలోని హాస్పటల్‌కు తరలిస్తుండగా శివాలయం వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘర్షణకు పాల్పడారు. రాళ్లు వేసుకుంటూ ఇళ్లల్లోకి చొరబడ్డారు. ముందుగానే పథకం ప్రకారం పోలేరమ్మ దేవాలయం వద్ద పెట్రోల్ బాంబులు, కర్రలు, మారణాయుధాలు ఏర్పాటుచేసుకున్నారు. ఎన్నికలు ముగిసే సమయానికి రాళ్లు వేసుకుంటూ, పెట్రోల్ బాంబులు వేసుకుంటూ, గాజు సీసాలు ఇసురుకుంటుండగా ఇరువర్గాలు రాళ్లు విసురుకున్నారు. ఈ ఘటనలో వైఎస్సార్ సీపీ కార్యకర్త కృష్ణకు, మరికొంత మందికి గాయాలయ్యాయి. వీరికి ప్రథమ చికిత్స నిర్వహించి పిడుగురాళ్ల హాస్పటల్‌కు తరలించారు. బ్రాహ్మణపల్లి గ్రామంలోని మెయిన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో రిగ్గింగ్ చేసేందుకు రేగులగడ్డ, పిడుగురాళ్ల నుంచి కొంతమంది వచ్చారు. పోలీస్ బలగాలు వారిని అడ్డుకున్నాయి. రోడ్డు పక్కనే ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మాబు కారును ధ్వంసం చేశారు. మండలంలోని జానపాడు గ్రామంలో తెలుగుదేశం తమ్ముళ్లు వైఎస్సార్‌సీపీ కార్యకర్త మదరస్సా తల పగలగొట్టారు. అక్కడక్కడ తెలుగుదేశం తమ్ముళ్లు గొడవలకు దిగారు. పోలింగ్‌ను అడ్డుకునే చర్యలు చేపట్టారు. మండలంలోని కరాలపాడు గ్రామంలో రాత్రి అయినా పోలింగ్ జరుగుతుండగా 200 మంది క్యూలైన్‌లో ఉండగా బయట నుంచి వచ్చిన వ్యక్తులు పోలింగ్ కేంద్రంపై రాళ్లు రువ్వారు. వైఎస్సార్ సీపీకి మెజార్టీ అధికంగా ఉన్న గ్రామాల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన వారు గ్రామాల్లోకి వచ్చి అల్లర్లు సృష్టించారు.

టీడీపీ దౌర్జన్యాల నడుమ పోలింగ్

- గుండ్లపల్లి, చీమలమర్రిలో ఈవీఎం ప్యాట్‌లు ధ్వంసం
- రెండు కేంద్రాలలో కొద్దిసేపు నిలిచిన పోలింగ్
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తీవ్రగాయాలు


దాడిలో గాయపడిన గుత్తికొండ నన్నేసా


చీమలమర్రి గ్రామంలో 198వ పోలింగ్‌బూత్‌లో టీడీపీ మూకలు ధ్వంసం చేసిన ఈవీఎం, వీవీప్యాట్

నకరికల్లు: ఘర్షణలు, ఉద్రిక్త వాతావరణం నడుమ మండలంలో పోలింగ్ ముగిసింది. చీమలమర్రి గ్రామంలో 197, 198 పోలింగ్‌బూత్‌లలో ఎన్నిక నిలిచిపోయింది. చీమలమర్రి గ్రామంలో టీడీపీ వర్గీయులు వైఎస్సార్ కార్యకర్తలతో వాదులాటకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాలు పరస్పర రాళ్ల దాడికి దిగాయి. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. ఘటనలో వైఎస్సార్‌సీపీకి చెందిన సొసైటీ అధ్యక్షుడు కావేటి రామారావు, అదే కుటుంబానికి చెందిన కావేటి రామాంజనేయులు, కావేటి వీరాస్వామి, కావేటి శ్రీనివాసరావులకు గాయాలయ్యాయి. సొసైటీ అధ్యక్షుడు కావేటి రామారావు ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించిన టీడీపీ కార్యకర్తలు ఇంటిని, కారును ధ్వంసంచేశారు. అదే గ్రామంలో ఇరువర్గాలు రాళ్లు రువ్వుకున్న ఘటనలో టీడీపీకి చెందిన పెమ్మసాని పాపయ్యకు గాయాలయ్యాయి. చీమలమర్రిలోని 198వ పోలింగ్ కేంద్రంలోకి టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యంగా ప్రవేశించి ఈవీఎంను, వీవీప్యాట్‌లను ధ్వంసం చేశారు. 197,198 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ నిలిచిపోయింది. తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకొని ఈవీఎంలను సరిచేసి పోలింగ్ ప్రారంభించారు. కుంకలగుంట గ్రామంలోని 219 పోలింగ్‌బూత్ వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్తలు కొత్తపల్లి కృష్ణ, పొలిమేర దుర్గ, మరో ఇద్దరు కార్యకర్తలు మొత్తం నలుగురికి గాయాలయ్యాయి. టీడీపీకి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. తాత్కాలికంగా పోలింగ్ నిలిపివేసిన అధికారులు తిరిగి పునఃప్రారంభించారు. రూపెనగుంట్ల గ్రామంలో ఐదుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. తెలగొర్ల శ్రీనివాసరావు, పానెం అనీల్, గోగా శ్రీనివాసరావు, కోనంకి నాగరాజు, కోనంకి రామకోటేశ్వరరావులకు తీవ్రగాయాలు కాగా వారిలో తెలగొర్ల శ్రీనివాసరావును గుంటూరు తరలించారు. గుండ్లపల్లి గ్రామంలో 170, 171 పోలింగ్ కేంద్రాలలో 400 మందికిపైగా వైఎస్సార్‌సీపీ ఓటర్లు ఓటు వేసేందుకు వేచి ఉండగా టీడీపీ అల్లరి మూకలు ప్రవేశించి వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు గుత్తికొండ నన్నేసాపై దాడి చేశారు. ఘటనలో మరికొందరు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. 170వబూత్‌లోని ఈవీఎంను ధ్వంసం చేశారు. పోలింగ్ తాత్కాలికంగా నిలిపివేసి పునఃప్రారంభించారు.

వైఎస్సార్ సీపీ నేతలపై టీడీపీ దాడులు

- కేసానుపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలు
- దాచేపల్లిలో వైఎస్సార్ సీపీ నేత ఇంటిపై దాడి


టీడీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడిన బొల్లా శ్రీనివాసరావు, ఆయన కుమారుడు మధు


కేసానుపల్లిలో టీడీపీ నేతల దాడిలో కిందపడిన వైఎస్సార్‌సీపీ నేత నెల్లూరి రామారావు

దాచేపల్లి: మండలంలో టీడీపీ నేతలు బరితెగించారు. పోలింగ్ సందర్భంగా సోమవారం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు పాల్పడ్డారు. ఓటర్లు భయంతో పరుగులు తీశారు. మండలంలోని కేసానుపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న బొల్లా శ్రీనివాసరావుపై టీడీపీ నేతలు దాడికి పాల్పడ్డారు. దాడిని అడ్డుకునేందుకు వచ్చిన కుమారులు దిలీఫ్, మధులపై కూడా దాడి చేయటంతో కంటికి, తలకు బలమైన గాయాలయ్యాయి. శ్రీనివాసరావుపై పిడిగుద్దుల వర్షం కురిపించటంతో సొమ్మసిల్లి పడిపోయాడు. ఇదే పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్ సీపీ నేత నెల్లూరి రామారావు, చుండు రామారావులపై కూడా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాడిలో నెల్లూరి రామారావు తీవ్రంగా గాయపడ్డాడు. ముగ్గురిని చికిత్స కోసం పిడుగురాళ్ల తరలించారు. మరో నలుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కూడా టీడీపీ నాయకులు దాడి చేశారు. టీడీపీ నాయకులు దాడులకు పాల్పడటంతో ఓటు వేసేందుకు వచ్చిన మహిళలు కూడా గాయపడ్డారు. దాచేపల్లి నగర పంచాయతీలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం నగర పంచాయతీ మాజీ చైర్మన్ మునగా రమాదేవి భర్త పున్నారావుపై టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు. పోలీసులు సర్దిచెప్పిన తరువాత ఎవరి దారిని వారు వెళ్లారు. ఆ తరువాత టీడీపీ, జనసేన నాయకులు దాచేపల్లిలోని పున్నారావు ఇంటి వద్దకు వెళ్లి రాళ్లు రువ్వారు. అడ్డుకుబోయిన పున్నారావు బంధువులను దుర్భాషలాడారు. మండలంలోని నడికుడిలోని పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నాయకులు హల్‌చల్ చేశారు. మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డిని దుర్భాషలాడారు. టీడీపీ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డిపై దాడి చేసేందుకు ప్రయత్నించగా అక్కడ ఉన్న మహిళలు అడ్డుకున్నారు. పోలింగ్ సరళి పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డిని అడ్డుకునే ప్రయత్నం చేయగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రతిఘటించారు.

పోలీసులు టీడీపీకి కొమ్ము కాశారు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పీఆర్కే


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రెంటచింతల: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసులు పూర్తిగా టీడీపీకి కొమ్ము కాశారని పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. మండలంలోని పాలువాయిగేటు గ్రామంలో వైఎస్సార్ సీపీ ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోకుండా టీడీపీ వర్గీయులు అడ్డుకోవడంతో పీఆర్కే గ్రామానికి చేరుకుని విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వెల్దుర్తి మండలం కండ్లకుంట, కేపీ గూడెం గ్రామాలలో ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతుండగా అక్కడ ఏఎస్పీ, డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీ, ఆరుగురు సీఐలు, 9 మంది ఎస్ఐలు అదనపు బలగాలు మోహరింప చేశారన్నారు. రెంటచింతల మండలం తుమృకోట, పాలువాయిగేటు గ్రామాలలో టీడీపీ గుండాలు బరితెగించి ఓటర్లను భయందోళనకు గురిచేసి ఓటింగ్‌ను అడ్డుకున్నా ఎవరూ స్పందించిన దాఖలాలు లేవన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌కు, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్యామ్‌ప్రసాద్‌కు, గురజాల డీఎస్పీ పల్లపురాజుకు, సీఐ తదితర అధికారులకు సుమారు 70 సార్లు ఫోన్ చేసినా స్పదించలేదన్నారు. సమస్యాత్మక గ్రామంగా పేరు పొందిన తుమృకోటలో ఎందుకు పటిష్టమైన చర్యలు చేపట్టలేదని ప్రశ్నించారు. పాలువాయి గేటు గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని ఆరో ఎందుకు సందర్శించలేదని ప్రశ్నించారు.

వెల్దుర్తిలో చెదురుమదురు సంఘటనలు


గొట్టిపాళ్లలో ఇరువర్గాలు రువ్విన రాళ్లు



టీడీపీ రౌడీమూకల దాడిలో ధ్వంసమైన కారు

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామాలలో సార్వత్రిక ఎన్నికలు చెదురుమదురు సంఘటనలు మధ్య ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని వెల్దుర్తి గ్రామంలో వైఎస్సార్ సీపీ ఏజెంట్లను బయటకు లాగి దాడి చేసి గిగ్గింగ్‌కు పాల్పడ్డాడు. 137, 138, 139, 140, 141 బూత్‌లలో కూర్చొన్న వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను బయటకు లాగి టీడీపీ రౌడీమూకలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. మండలంలోని లోయపల్లి, మిట్టమీదిపల్లె, మండాది, పట్లవీడు, మరసపెంట, గొట్టిపాళ్ల గ్రామాలలో ఇరు పార్టీలకు చెందిన వారు రాళ్లు రువ్వుకున్నారు. మండలంలోని మర్సపెంటలో సర్వలెస్ అధికారి పుల్లారెడ్డి కారుపై టీడీపీ నాయకులు వజ్రం నాయక్, రెడ్యానాయక్‌ల ఆధ్వర్యంలో పలువురు దాడి చేశారు. పుల్లారెడ్డిపై దాడి చేశారు. గొట్టిపాళ్లలోలో రాళ్లు రువ్వుకుంటున్న ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టారు. ఎన్నికలు పలు చోట్ల ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని అన్నీ గ్రామాలలో మహిళలు, వృద్ధులు, పెద్దఎత్తున బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 80శాతానికి పైగా పోలింగ్ జరిగింది. కొన్ని గ్రామాలలో 6గంటలకు ఓట్లు పూర్తి కాకపోవటంతో 8గంటల సమయంలోనూ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

టీడీపీ నేతల బరితెగింపు

- కొత్తగణేశునిపాడులో వైఎస్సార్ సీపీ నాయకుల ఆస్తులు ధ్వంసం
- గ్రామం నుంచి తరిమివేత

గురజాల (మాచవరం): గురజాల నియోజకవర్గంలోని మాచవరం మండలం కొత్తగణేశునిపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రేణులను టార్గెట్ చేస్తూ టీడీపీ నేతలు విధ్వంసానికి దిగారు. గ్రామంలో భీకరవాతావరణాన్ని సృష్టించారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓటింగ్ జరిగిందనే అక్కసుతో దాడులకు పాల్పడ్డారు. దాడుల్లో వైఎస్సార్ సీపీకి చెందిన పలువురికి గాయాలు కాగా, ఆస్తులను, కార్లు, ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, జేసీబీలను ధ్వంసం చేశారు. బీసీ కులాలకు యాదవ, రజక కుటుంబాల ఇళ్లల్లోకి వెళ్లి టీవీలు, ఫ్రిడ్జులు, ఎలక్ట్రికల్ వస్తువులను పూర్తిగా నాశనం చేశారు. మహిళలను, పిల్లలను ఇళ్ల నుంచి తరిమివేశారు. ఇళ్లను ధ్వంసం చేశారు. ఇళ్లల్లో ఉన్న మహిళలను బూతులు తిడుతూ బయటకు లాగేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. వందలాది మంది టీడీపీ కార్యకర్తలు ప్రధాన రహదారిపై దారి కాచి వేచి ఉండడంతో పలు గ్రామాలకు వెళ్లే ప్రజలు భయంతో తిరిగి పిడుగురాళ్ల వైపు వెళ్లారు. విషయం తెలిసినా పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ల లేని పరిస్థితి నెలకొంది. గ్రామంలో సుమారు 3 గంటలపాటు విధ్వంసానికి పాల్పడినా పోలీసులు గ్రామం వైపు కన్నెత్తి చూడలేదని విమర్శలు ఉన్నాయి.

ముటుకూరులో రెచ్చిపోయిన టీడీపీ మూకలు

- కనిపించని కేంద్ర బలగాలు
- ఓటర్లకు భద్రత కరువు



దుర్గి: తెలుగుదేశం నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ రెచ్చిపోయారు. మండలంలోని ముటుకూరు గ్రామ ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన 181, 182 బూత్‌లలో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతుంది. ఆ సమయంలో గుంపుగా వచ్చిన టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా రాళ్లు, కర్రలతో వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు పాల్పడ్డారు. రాళ్ల దాడిలో వైఎస్సార్‌సీపీ నేత జాస్తి రామ్మూర్తితోపాటు పలువురికి గాయాలయ్యాయి. అడిగొప్పల, పోలేపల్లి గ్రామంలో తెలుగుదేశం నేతలు దాడులకు పాల్పడటంతో పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నేతలకు గాయాలయ్యాయి. దుర్గి, ఆత్మకూరు, కంచరగుంట, కోలగుట్ల, ధర్మవరం గ్రామాలలో స్వల్ప ఉద్రిక్తతతో ఎన్నికలు ముగిశాయి. టీడీపీ నేతల అరాచక చర్యల పట్ల పలువురు మహిళలు ఓటింగ్ ఉపయోగించుకోవటానికి భయపడ్డారు. మండలంలోని 49 పోలింగ్ బూత్‌లలో కనీస భద్రత కల్పించటంలో పూర్తిగా విఫలమైంది.